అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 24 ఏప్రిల్ 2023

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం
నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని మేదరిపేటలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాబు సుగునాకర్ మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు వల్ల ప్రయాణికులకు, స్థానికులకు దాహం తీరనుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి రాజన్న, కోశాధికారి మాదంశెట్టి మల్లికార్జున్, ఉపాధ్యక్షులు కుంచె కిషన్, కొండు జనార్ధన్, రాస శేఖర్, కోండు రామన్న, బూసిరాజు రాజన్న, పాత శ్రీనివాస్, కొత్త శ్రావణ్, ఎనగందుల సత్యం పాల్గొన్నారు.

గెజిటెడ్ లెక్చరర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక
నవతెలంగాణ-లక్షెట్టిపేట్

తెలంగాణ ప్రభుత్వ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా ఎన్నికలు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. లక్షెట్టిపేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.తన్నీరు సురేశ్, జిల్లా అధ్యక్షులుగా మంచిర్యాల కళాశాలకు చెందిన ఫిజిక్స్ లెక్చరర్ కిషోర్ కుమార్ జిల్లా జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి అర్.గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి కళాశాల ప్రిన్సిపల్ గోపాల్, చెన్నూరు ప్రిన్సిపాల్ శ్రీదేవి, మంచిర్యాల జిల్లా గెజిటెడ్ లెక్చరర్లు శ్రీనివాస్, మంజుల, సవిత, శంకరయ్య, రాజ్ కుమార్, తిరుపతి హాజరైనారు. ఈసందర్భగా నూతన కార్యవర్గం అధ్యక్షులు జనరల్ సెక్రెటరీ సురేష్, కిషోర్ కుమార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం
నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొండాపూర్ యాప గ్రామంలో ఆదివారం మోకు దెబ్బ మండల శాఖ ఆధ్వర్యంలో గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలో గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గౌడ కులస్తులంతా ఐకమత్యంతో సంఘాన్ని ముందుకు సాగాలని సమస్యలు పరిష్కరించుకోవాలని మండల కమిటీ సలహాదారులు ఈ రాజయ్య, తాటిపాముల శంకరయ్య, నేరెల్లి బుగ్గయ్య, పల్లె మల్లయ్య, బుర్ర లింగగౌడ్‌లు సూచించారు. అనంతరం మండల నూతన కమిటీ అధ్యక్షులుగా ఎంపికైన మార్క శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోడేటి రాజగౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్ గౌడ్, రాజబాబు గౌడ్లతో పాటు సలహాదారులను మండల కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. అనంతరం మండల గౌడ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. గౌడ యువత అధ్యక్షుడిగా కొయ్యడ అంజన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడ్డం ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా, భైరి నరేష్ గౌడ్, కోడూరి శ్రావణ్‌గౌడ్, సహ కార్యదర్శిగా తాటిపాముల కిరణ్ గౌడ్, కోశాధికారిగా బుర్ర ప్రకాష్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి గౌడ కులస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఆలయ కార్యదర్శిపై క్రిమినల్ కేసు నమోదుచేయాలి
నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటిలోని శ్రీ కోదండ రామాలయంలో రూ.10 లక్షల నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ఆలయ కార్యదర్శి ఎస్.ప్రకాష్‌రావు క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్, నియోజకవర్గ కన్వీనర్ సొల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సదరు వ్యక్తిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి డబులు రికవరీ చేయాలన్నారు. గోలేటిలోని కోదండ రామాలయం గత ఆరు సంవత్సరాల నుండి కమిటీ సభ్యులకు, భక్తులకు ఎలాంటి లెక్కలు చెప్పకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఆలయ సెక్రటరీ ఎస్ ప్రకాష్‌రావు(టీబీజీకేయస్) రూ.89 వేలు, ఏఐటీయూసీ రూ.2.20 లక్షలు నాయకులతో కుమ్మక్కై, వారికి ఇచ్చిన రూ.మూడు లక్షలతో పాటు రామాలయానికి సంబంధించిన సుమారు రూ.7 లక్షలు లెక్కలు చూపడంలేదన్నారు. మొత్తం రూ.10 లక్షల నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. అనేకసార్లు లెక్కలు అడిగిన చెప్పడంలేదన్నారు. సింగరేణి కార్మికులు, గోలేటి ప్రజల నుండి వచ్చిన నిధులకు లెక్కలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గత్తిని రమేష్, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేష్, ఉపాధ్యక్షుడు డోంగ్రి లక్ష్మయ్య, పార్వతి, ప్రసాద్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఇందూరి నాగేందర్ పాల్గొన్నారు.

పాత రూట్ మ్యాప్ తోనే రహదారిని విస్తరించాలి
- కేంద్ర మంత్రికి కిషన్‌రెడ్డికి బాదితుల వినతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎన్‌హెచ్-63 ఫోర్ లైన్ రహదారిని పాత రూట్ మ్యాప్ ప్రకారమే విస్తరించాలని కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డి లక్షెట్టిపేట్‌కు చెందిన బాదితులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఎఐ ఆర్వో, కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రులకు ఇటీవల వినతి పత్రం అందజేసిన బాధితులు తాజాగా మంత్రి కిషన్ రెడ్డితో తమ గోడును విన్నవించుకున్నారు. లక్షెట్టిపేట మీదుగా మంచిర్యాల వరకు కొత్త రూట్ మ్యాప్‌తో ఫోర్ లైన్ రహదారిని విస్తరిస్తే భారీగా నివాస గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు కోల్పోవడమే కాకుండా, విలువైన వ్యవసాయ భూములు లేకుండా చాలా మంది నష్టపోతారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పట్టణాలను, గ్రామాలను తప్పిస్తూ పాత రూట్ మ్యాప్ ప్రకారం బైపాస్‌లతో రహదారిని విస్తరించడం వల్ల ఆస్తి నష్టం తక్కువగా ఉంటుందని విన్నవించారు. తమ వినతిపై కేంద్ర టూరిజం శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని బాధితులు పేర్కొన్నారు.

రేణుక ఎల్లమ్మ గుడి వద్ద బోర్‌వెల్ ప్రారంభం
నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలో గల శ్రీరేణుక ఎల్లమ్మ గుడి వద్ద ఆసిఫాబాద్ శాసనసభ్యులు ఆత్రం సక్కు చొరవతో గుడి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఎల్లమ్మ గుడి వద్ద నీటి సౌకర్యం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇట్టి విషయాన్ని సొసైటీ సభ్యులు గత రెండు రోజుల క్రితం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వివరించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం ఆదివారం బోర్‌వెల్‌ను పంపించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఎంపీటీసీ పెసరి మధునయ్య, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, మహిళా మండలి అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ మురళీగౌడ్, సొసైటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి కృష్ణాగౌడ్, చిరంజీవిగౌడ్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

చందారంలో ఉచిత వైద్య శిబిరం
నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని చందారం గ్రామంలో మిర్యాల రాధమ్మ-రామరావు జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు తోచిన సహాయం చేయాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య పరీక్షలు ఈసీజీ, రక్త పరీక్షలు, అన్ని రకాల వ్యాదులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎన్‌ఆర్ఐ డాక్టర్ మిర్యాల వినోద్ రావు మాట్లాడుతూ వృద్దులు, పేద ప్రజలకు బీపీ, గుండె, రక్తపోటు, పక్షవాతం, సంబంధించిన వ్యాదులు ఈ మధ్యకాలంలో అధికంగా వస్తున్నాయని దీంతో మరణాలు జరుగుతున్నాయన్నారు. వీటికి సంబంధించిన పరీక్షలు మూడు నుంచి ఆరు నెలలకొక్కసారి చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రతి రోజు వ్యాయామం తప్పనిసరి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయంత్, ఎంపీపీ అన్నం మంగ, మాజీ ఎంపీటీసీ అనుమాల పద్మ వేణు, మధుకర్, రవీందర్ రావు, రమేష్, సత్యనారాయణ, మల్లేశం పాల్గొన్నారు.

రేపు కేశవనాథ ఆలయ భూముల కౌలు వేలం
నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేశవ ఆలయం ఆధీనంలో ఉన్న భూములు ఒక సంవత్సరం కౌలు ఇవ్వడానికి రేపు అనగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వాడలో మినీ ఫంక్షన్ హాల్‌లో వేలం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.20 వేల ధరావత్ సొమ్ముగా చెల్లించాలని పేర్కొన్నారు. వేలంపాట పూర్తయిన తర్వాత పూర్తి డబ్బు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 9618307962, 9885489088, 9908867600, 9491344496 నెంబర్ సంప్రదించాలని పేర్కొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం
- పెచ్చులూడుతున్నా పట్టించుకోని వైనం

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. నైజాం కాలంలో నిర్మించిన భవనం కావడంతో అది శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయ ఆవరణలో చిన్న రేకుల షెడ్డు నిర్మించి అందులోనే విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. యేండ్లు గడుస్తున్న కార్యాలయ మరమ్మతులు, చేపట్టకపోవడం రికార్డులకు రక్షణ లేకుండా ఉందని ప్రజలు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పెచ్చులు ఊడుతున్నా, పైకప్పు లేచిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అంటున్నారు. స్థానికులు. దీని పాలకులు సైతం చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు. కార్యాలయానికి వస్తున్న ప్రజలు చెట్టు కింద కూర్చుండి తమ అధికారుల కోసం వేచి చూస్తున్న దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మిస్తున్న ప్రభుత్వం స్థానిక తహల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణంపై దృష్టి ఎందుకు సారించడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి, ప్రజా అవసరాలకు ఉపకరించే ప్రభుత్వ తహసీల్దార్ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అందరికీ అవసరం ఉండే తహసీల్దార్ కార్యాలయానికి పునరుద్ధరణ కాని, నూతన నిర్మాణం కాని చేపట్టకపోవడం ఎమిటని మండల ప్రజలు వాపోతున్నారు.

కనీస సౌకర్యాలు లేవు
గడ్డం కిషన్‌రెడ్డి (వ్యాపారి)



మండలంలోని ప్రజలకు అత్యధిక అవసరాలు తీర్చే తహసీల్దార్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేవు. ప్రజలు వస్తే కూర్చుండటానికి, సేద తీరడానికి ప్రత్యేక గదులు కాని, కుర్చీలు కాని లేవు. కార్యాలయానికి వచ్చేవారు ఆరు బయట చెట్లకింది పనులు పూర్తి అయ్యేంత వరకు వేచి చూడాల్సి వస్తోంది.

అధికారులు పాలకులు స్పందించాలి
దొనికేని దయానంద్ (కాంగ్రెస్ మండల అధ్యక్షుడు)



స్థానిక తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణంపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజా అవసరాలపై దృష్టి సారించి, తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం కృషి చేయాలి. అప్పుడే ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ పనులను పూర్తయ్యే వరకు ఒపికగా ఉండి పనులు పూర్తి చేసుకుంటారు.

నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం
తహసీల్దార్ రాజ్ మోహన్



శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం పునర్‌నిర్మాణం కోసం నూతన భవన ఏర్పాటు కోసం రూ.కోటి వెచ్చించాలని, నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే నూతన భవన నిర్మాణం చేపడుతాం.

ఆర్టీసీ కార్మికులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తెలంగాణ ఆర్టీసీలో కార్మిక వ్యతిరేక యాజమాన్య నిర్ణయాలపై ఐక్య పోరాటానికి సిద్ధంకావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఎస్ ఆర్టీసీలో సంస్కరణలు అమలు చేయడాన్ని కార్మిక సంఘాలు ప్రతిఘటించకుండా వుండటం కోసం కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించారన్నారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకుపోవటానికి వున్న అన్ని మార్గాలను మూసివేశారన్నారు. కనీసం యూనియన్లుగా ఇచ్చే వినతిపత్రాలను కూడా డిపో మేనేజర్లుతో సహా అధికారులు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతం కంటే ఆర్టీసీలో కిలోమీటర్ల సంఖ్య పెరిగిందని, యాజమాన్య తీరుతో వీఆర్ఎస్ ఇతరత్రా విధానాలతో 7000 మందికి పైగా కార్మికులు తగ్గిపోయారని అన్నారు. 8 గంటల పనికి బదులు 14 నుండి 16 గంటలు పని చేయిస్తున్నారని ఆరోపించారు. మస్టర్లను కుదించడంతోపాటు పని భారం ఎక్కువ చేశారన్నారు. కార్మికులకు అండగా ఉన్న క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీని దివాలా తీయిస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ ప్రయివేటుపరం కాకుండా కాపాడుకోవడం కోసం, పని పరిస్థితులలో మార్పుకోసం, వేతన ఒప్పందాల కోసం ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్మికులు చేసే పోరాటాలకు సీఐటీయూ అండగా వుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

మాదిగల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
నవతెలంగాణ-నస్పూర్



మాదిగల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం సీసీసీ ప్రెస్ క్లబ్‌లో మహనీయులైన జ్యోతిరావు బాపులే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మాదిగలు సామాజిక వ్యవస్థలో వెనుకబాటుతనానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మహనీయులు చూపిన బాటలో మాది హక్కుల దండోరా పనిచేస్తుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా, మాదిగ హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో రాజకీయాలలో మాదిగలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. మాదిగలకు ఎవరైతే సముచిత స్థానాన్ని కల్పిస్తారు వారికి అన్నివేళలా తోడుంటామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్ చౌరస్తాలో, బెల్లంపల్లి చౌరస్తాలో జ్యోతిరావు బాపులే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్కు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. మాదిగలకు జిల్లాలో భవనం కావాలని, స్టడీ సర్కిల్, కళావేదిక ఏర్పాటు చేయాలని, మహనీయుల ఉత్సవాలు జరపడానికి 5 ఎకరాల భూమి కావాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శ్రీపతి, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ కొంగ్ర లింగయ్య, మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ కొప్పర్తి రాజం, మాది ఆకుల దండోరా జిల్లా అధ్యక్షుడు కడారి రమేష్, నాయకులు ప్రవీణ్, కోంగ్ర ఉదయ్, అట్కపురం సమ్మయ్య, సీపెల్లి సాజన్, కిరణ్ పాల్గొన్నారు.

ఈటెల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం
నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలో మంచిర్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మీద అనుచిత వాక్యాలు చేయటం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాజేందర్ మీరు అధికార పార్టీ మీద కొట్లాడుతున్నారా లేకపోతే అధికార పార్టీతో కుమ్మక్కై కేసీఆర్‌తో అంతర్గత ఒప్పందంతో రేవంత్‌రెడ్డి మీద విమర్శలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. మీరు నిజంగా కేసీఆర్‌తో అంతర్గత ఒప్పందం లేకపోతే ఆయన చేసిన ఒక్క అవినీతిని కూడా ఎందుకు బయట పెట్టడంలేదని అన్నారు. ఇంకో సారి మా రేవంత్‌రెడ్డి మీద పిచ్చి కూతలు కూస్తే తెలంగాణ రాష్ట్రంలో తిరగవని యూత్ కాంగ్రెస్ హెచ్చరిస్తుందని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గుండా రాజ్‌కుమార్, సల్లూరి సమీల్, కుమార్, బిక్షపతి, జాడి మల్లేష్, కామలాకర్, గొనె రాజన్న, బన్న రవిరాజా, అనపర్తి వెంకటేష్, రత్నం సాయి పాల్గొన్నారు.

గంగాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలి
నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని పేర్కొంటున్నారు. గ్రామంలో గత 10 రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉందని ఎండాకాలం కావడంతో నీటి వినియోగం అధికంగా ఉంటుందనే విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితిలో 13 రోజుల నుండి గ్రామంలో నీటిని సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి మురళీకి ఫోన్ చేసి మాట్లాడితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ రేపు వస్తాయా ఎల్లుడి వస్తాయి అని చెపుతూ కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలో ఒకేఒక బోర్‌వెల్ ఇవ్వడంతో, ముఖ్యంగా రెండో వార్డులో ఈ సమస్య చాలా తీవ్రంగా ఉందని, దాదాపు 75 కుటుంబాలు ఉన్న ఈ వార్డులో ఒకేఒక చేతిపంపు ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ సరఫరా పైపులైన్ మరమ్మత్తులు ఉంటే ఊరి బోర్‌వెల్ పైపులైన్ ఉండి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై సంబంధిత అధికారులు, సర్పంచ్ వెంటనే స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

బాల్క సుమన్ చేసిన అనుచిత వాక్యలు వెనక్కి తీసుకోవాలి
నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ బీజేపీ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని బీజేపీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి, చెన్నూరు నియోజకవర్గ బాధ్యులు అందుగుల శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడుగడుగునా ప్రశ్నించేది ప్రజల పక్షాన నిలిచేది బీజేపీ కార్యకర్తలే అటువంటి నాయకులను కార్యర్తలను విమర్శించడం సరికాదన్నారు. ఇప్పటికైనా పదవి స్వీకరించినప్పటి నుండి చెన్నూరు నియోజకవర్గ అభివద్ధి కోసం ఏం చేసావ్ అనేది శ్వేతా పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, చెన్నూరు నియోజకవర్గ కన్వీనర్ అక్కల రమేష్, ప్రధాన కార్యదర్శి అరిగెల రవీందర్, మందమర్రి పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, ఎస్సీ మోర్చా కేతనపల్లి అధ్యక్షులు, బంగారి ప్రసాద్, మందమర్రి పట్టణ యువమోర్చా అధ్యక్షుడు ఒరగంటి సురేందర్, ప్రధాన కార్యదర్శి గుండేటి శశి వరుణ్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి పంచాయితీ సెక్రటరీల వినతి
నవతెలంగాణ-తాండూర్

ప్రొహిబిషనరీ పిరియడ్ పూర్తి చేసుకున్న తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మెచేయనున్నట్లు బెల్లంపల్లి, తాండూరుకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండ విటల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ పథకాలు అమలు పరచడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వినతి పత్రంలో పేర్కొన్నారు. తమను రెగ్యులరైజ్ చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులరైజ్ జీవోలు విడుదల చేసినట్లయితే సమ్మె ఆలోచనను వెనక్కు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లాకు చెందిన కార్యదర్శులు శ్రీనివాస్, తాండూర్ మాసాడి హరీష్, బెల్లంపల్లి హర్షద్ పాల్గొన్నారు.

ఎస్‌సీఈడబ్ల్యూయూ నూతన కార్యర్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ యూనియన్ (సీఐటీయూ) మందమర్రి ఏరియా డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియూ) జిల్లా అధ్యక్షులు అబ్బోజి రమణ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ హాజరయ్యారు. నూతన బ్రాంచ్ అధ్యక్షులుగా ఎస్.వెంకట స్వామి, కార్యదర్శిగా అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులుగా రామగిరి రామస్వామి, ఎ.రమణ, ఎ.సంజీవ్, కోశాధికారి, సంయుక్త కార్యదర్శిగా వడ్లకొండ ఐలయ్య, ఆర్గనైజర్ జె.వెంకటేష్ బి.భరత్, కే.రవీందర్, ఎండి ఆరిఫ్, కమిటీ సభ్యులుగా వేణుగోపాల్, ఎం.రాజమల్లు, ఎస్.వెంకటేష్, డి.తిరుపతి, ఏ.రాజ్ కుమార్, బి.శ్రీనివాస్ ఎన్నుకున్నారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శికి సన్మానం
నవతెలంగాణ-లక్షెట్టిపేట్

అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అవునూరి లక్ష్మణ్ ను ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పట్టణ, మండల అధ్యక్షులు బోనగిరి కుమార్, దొంత నర్సయ్య లు మాట్లాడుతూ.... గత 25 ఏళ్లుగా లక్ష్మణ్ అంబేద్కర్ సంఘానికి అందించిన సేవలు మరువలేనివన్నారు.అంబేద్కరిజం వ్యాప్తిలో, సంఘాన్ని బలోపేతం చేయడంలో మండల, జిల్లా స్థాయిల్లో వివిధ పదవులు చేపట్టి బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించారని కొనియాడారు. రాష్ట్ర కమిటీ లక్ష్మణ్ సేవలు గుర్తించి సహాయ కార్యదర్శి గా నియమించడం లక్షెట్టిపేట్ పట్టణ, మండల అంబేద్కరిస్ట్ లకు గర్వకారణమన్నారు. అనంతరం అవునూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.... రాష్ట్ర స్థాయి పదవితో తన బాధ్యతలు మరింతగా పెరిగాయన్నారు.అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిప్పకుర్తి నారాయణ, శనిగరపు లింగయ్య,నాయకులు రాం దాస్,లింగంపల్లి వెంకటేష్, చొప్పదండి రమేష్, ధర్మన్న, సమేనపల్లి కిషన్, గోడిసేలా రాజేష్, బిరుదుల సత్యనారాయణ, శిల్పత్రి, ఓరుగంటి సత్యనారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడి హఠాన్మరణం
నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువకుడు హఠాత్మరణం చెందిన సంఘటన మండలంలోని ఇటిక్యాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జంపాల నరేష్(35) రోజులాగే ఊర్లో కొంతమందికి తన కులవృత్తి అయిన క్షౌరం చేసి తిరిగి ఇంటికి వచ్చి ఇంటి ముందు పడిపోయాడు. వెంటనే ఇంట్లో వారు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుని అన్న జంపాల సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రమేష్ తెలిపారు.

వైశ్య రక్షక్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని ఆర్యవైశ్య సంఘం ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్ అన్నారు. ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి వేడుకల్లో భాగంగా వైశ్య రక్షక్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో కులస్తులు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు. వారిని కార్యక్రమ అతిధులు అభినందించారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని వారు పేర్కొన్నారు. గత 2018 నుండి ప్రతి యేటా వైశ్య రక్షక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రెండో రోజు వేడుకల్లో భాగంగా అమ్మవారిని తమలపాకులతో అలంకరించారు.

ఉరేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

నవతెలంగాణ-కడెం



అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపం చెంది వృద్ధురాలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో కల్లెడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన ఏనుగందుల శంకరవ్వ(60) వృద్ధురాలు గత నాలుగు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటుంది. ఎంతకీ నయం కాకపోవడంతో నయం. కావడం లేదని మనస్థాపం చెంది ఉదయం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు ఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

- ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

నవతెలంగాణ-కడెం



మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన గోపు సుహాని(4) ఇంటి వద్ద ఆడుకుంటున్న క్రమంలో కుక్క దాడిచేసి కరిచింది. తల్లిదండ్రులు వెంటనే కడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దాదాపు రెండు గంటల పాటు ఆస్పత్రిలో నిరీక్షించారు. ఆనంతరం అటెండర్ ఫోన్ కాల్‌తో ఆస్పత్రికి సిబ్బంది వచ్చి చిన్నారికి వైద్యం అందించారు. ఆస్పత్రిలో అందుబాటులో లేని ఇన్‌చార్జ్ డాక్టర్, వైద్య సిబ్బందిపై చిన్నారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించని ప్రభుత్వాస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈటెల రాజేందర్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సిరికొండ

మల్కాజ్‌గిరి ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక, టీపీసీసీ అధ్యక్షుడిపై లేనిపోని ఆరోపణలు చేయడం కాదని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ ఎత్తుగడలో భాగంగా లేనిపోని అవాస్తవమైన మాటలు మాట్లాడిన ఈటెల రాజేందర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా వైస్ చైర్మెన్ ప్రవీణ్, మైనార్టీ చైర్మెన్ రంజాన్, నాయకులు లక్ష్మణ్, గంగాధర్, రాము, నాగు పాల్గొన్నారు.

బసవేశ్వరుని బోధనలు ఆదర్శనీయం



నవతెలంగాణ-గుడిహత్నూర్

బసవేశ్వరుని బోధనలు ఎప్పటికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సామాజికవేత్త మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా జరిగాయి. హనుమాన్ నగర్‌లో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ వేర్వేరుగా మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వర ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. కుల రహిత సమాజ స్థాపనకు కృషి చేసిన వ్యక్తి బసవేశ్వరుడని కొనియాడారు. దానం, ధర్మం, సమ సమాజం కోసం పాటు పడిన సామాజిక వేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు ఆర్యన్ మహరాజ్, ఉప సర్పంచ్ గజానంద్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్, చంద్‌పూరే కైలాష్, రావణ్ ముండే, సోంటక్కే ఆనంద్, యేల్మల్‌వార్ సంజయ్ మాధవ్ కేంద్రే, శ్రీరామ్ లాందాడే ఉన్నారు.

ఆదివాసుల సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడుకోవాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల వంశపరంగా వస్తున్న సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తగూడ గ్రామంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వెడ్మ పరివార్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొజ్జు మాట్లాడుతూ ఆదివాసులు తమ సంస్కృతి, సాంప్రదాయాలను మరిచిపోయి ఇతర మతాల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఇలా చేయడం మన సమాజానికి మంచిది కాదన్నారు. చాలా మంది మత మార్పిడి చేస్తూ వారి సంస్కృతికి విరుద్ధంగా వెళ్తుంటే వారికి పెద్దమనుషులు ఆలోచన చేసి వారిపై రాయిసెంటర్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆదివాసుల సాంస్కృతి, సాంప్రదాయాలు కాపాడటంలో అగ్రస్థానంలో ఉన్నారని అన్నారు. ఈ మాసం ఆదివాసులకు ఎంతో పవిత్ర మైనమాసమని ఈ నెల రోజులలో పెద్ద దేవుడు (జలి దేవర) గంగ స్నానం చేయించి, ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెడ్మ పరివార్ వెడ్మ దేవు, పటేల్ వెడ్మ భీంరావ్, వెడ్మ ఇంద్రు, శ్యాంరావు, ఆత్రం శ్యామ్‌రావు, వంద్ర జ్యోతిరాం, సుమన్, కనక విశ్వేశ్వరరావు, గంగు, జంగు ఉన్నారు.

పంటలు ఆశాజనకం..

చేతికందేదాక భయం.. భయం..

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ఈసారి రబీ వరిపంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మరో 20 రోజుల్లో పంట కోతకు రానున్న క్రమంలో అకాలవర్షాలు అన్నదాతకు ఆందోళన కల్గిస్తున్నాయి. మూడురోజుల కింద మండలంలో కురిసిన అకాలవర్షానికి మామిడి కాయలు నేలరాలి సదరు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొట్ట, గొళిక దశలో ఉన్న వరిపైరులకు ఎలాంటి నష్టం జరుగలేదు. వారం రోజులుగా ఏర్పడుతున్న వాతావరణ మార్పులు, అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఈసారి మండలంలో కుంటలు, చెరువులు, బోరుబావుల కింద 4 వేల 400 ఎకరాలు, సదర్‌మాట్ ఆయకట్టు దిగువన 14 వేల 600 ఎకరాల్లో వరి సాగుచేశారు. అలాగే 1400 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న, 1100 ఎకరాల్లో నువ్వుపంట సాగుచేశారు. వరి పంట గొళిక పాలు పట్టే దశలో ఉండగా, మొక్కజొన్న కంకి బలపడే దశలో ఉంది. నువ్వు పంట కాత బలపడే దశలో ఉంది. ఈ పంటలన్నీ ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందంతో ఉన్నారు. అయితే వారం రోజుల నుంచి ఏర్పడుతున్న వాతావరణ మార్పులు ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు.

అకాలవర్షాలతో వరిసాగు రైతుల్లో ఆందోళన..



ప్రకృతి సహకరిస్తేనే పంట చేతికి

కౌలు రైతు ఆడెపు భీమేష్



నేను ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వరిసాగు చేశాను. పైరు బాగాపెరిగి గొళిక వేసింది. మరో ఇరవై రోజులదాకా గాలివానలు పడకుండా ప్రకృతి సహకరిస్తే పంట దిగుబడి బాగా వస్తుంది. ప్రకృతి సహకరించపోతే నష్టపోతాం.

ఐకేపీ వీఓఏల సమ్మెకి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-పెంబి



రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా క్రాంతి పథకంలో పని చేస్తున్న17 వేల మంది ప్రారంభించే నిరవధిక సమ్మెకి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గత ఐదు రోజుల నుంచి ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ప్రభుత్వంపైన నిరసన తెలుపుతూ బతుకమ్మ ఆడి వీఓఏలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా సౌకర్యం ఏమీ లేకుండా అభద్రతతో బతుకులు వెళ్లదీస్తున్నారని అన్నారు. గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని అన్నారు. బ్యాంక్ లింకేజిలు, 8 రకాల ఆన్‌లైన్ సేవలు చేయడం, ప్రభుత్వం నుండి ఏ సర్వే వచ్చినా, కాదనకుండా సర్వే చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం దృష్టిలో కనీస గుర్తింపు కూడా లేదని అన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతీ నెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలో చెల్లించాలని అన్నారు. వీరికి ఆశా వర్కర్స్ యూనియన్, పశుమిత్ర, ఐకేపీ వీఓఏలకు మద్దతు తెలియజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు బింగి స్వప్న, ఉపాధ్యక్షులు సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి సిరిపెల్లి రమేష్ సాయి, కార్యదర్శి మమత, కోశాధికారి స్వప్న, రామచందర్, దేవరావు, జైవంత్‌రావు, అరవింద్, దిలీప్, రాజు, ప్రతిమ, సంగీత పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని గోసంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామం నడింపల్లి లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడింపల్లి గ్రామానికి చెందిన పోశమల్లు గత కొంతకాలంగా గొర్రె పిల్లను విక్రయిస్తూ గొర్రెలను పెంచుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. నివాస గృహాల మధ్యలో ఉండే గొర్రెల పాకలో అకస్మాత్తుగా ఆదివారం వేకువ జామున రెండు గంటల ప్రాంతంలో నాలుగు ఊర కుక్కలు గొర్రెల పాకలోకి చొరబడి విచక్షనా రహితంగా గొర్రెలపై దాడికి దిగాయి. ఈ ఘటనలో ఆ పాకలో ఉన్న 23 గొర్రెలలో 10 గొర్రెలు మృత్యువాత పడగా గాయపడ్డ గొర్రెలను స్థానిక పశువైద్య శాఖ అధికారులు చికిత్సలు నిర్వహించారు. ఇదిఇలా ఉండగా గ్రామంలో కుక్కలు మనుషులను, మూగజీవాలను తీవ్రంగా గాయపరుస్తున్నాయని ఆరోపిస్తూ తాను మరణించిన గొర్రెలతో నష్టపోయానని ఆ నష్టాన్ని ప్రభుత్వమే పూరించాలని డిమాండ్ చేస్తూ గోసంపల్లి గ్రామంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద బాధితుడు కుటుంబ సభ్యులతో బైఠాయించాడు. ధర్నా నిర్వహించి వెంటనే తన కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనకు గ్రామస్తులు కొమురయ్య, రాజ్ కుమార్, రాజన్న, రాకేష్, వేణు, రాములు, కుమార్, శంకర్ మద్దతుగా నిలిచారు.

చరిత్ర, సైన్స్‌పై కేంద్ర ప్రభుత్వ దాడిని ఖండిస్తున్నాం

- ఎన్సీఈఆర్టీ తక్షణమే తమ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్సీఈఆర్టీ సిలబస్ నుండి జీవ పరిణామ క్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను తొలగించటాన్ని, ఇంకా చరిత్ర నుండి మొఘలుల చరిత్ర, గాంధీహత్య, గుజరాత్ అల్లర్లు తదితర పాఠ్యాంశాలను తొలగించటాన్ని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) రాష్ట్ర కమిటీ పక్షాన రాష్ట్ర ఉపాధ్యక్షులు బైరి సోమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ చర్య చరిత్ర, సైన్స్‌పై మత శక్తులు దాడిగా పేర్కొంటూ, నూతన విద్యా విధానం పేరిట భారతీయ సమాజంపై కేంద్ర ప్రభుత్వ ధ్వంస రచన ప్రారంభమైందని ఆరోపించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత శాస్త్ర సాంకేతిక విద్యా సంస్థలకు చెందిన 1800 మంది సైన్స్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, శాస్త్ర వేత్తలు ఎన్సీఈఆర్టీ చర్యలను తప్పుపడుతూ సంస్థ డైరెక్టర్‌కు లేఖలు రాశారని, అభ్యుదయ, ప్రజాస్వామిక వాదులు, సైన్స్ ప్రేమికులు అందరూ ఈ చర్యలను తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్సీఈఆర్టీ తక్షణమే తమ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



పారిశుధ్య పనుల్లో కార్మికులు నిర్లక్ష్యం చేయొద్దని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు అన్నారు. ఆదివారం ఉదయం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్యంపై కార్మికులకు పలు సూచనలు చేశారు. వార్డుల వారిగా ఎవరికి అప్పజెప్పిన పనిని వారు సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. గతంలో మాదిరిగా కాకుండా బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదవుతుందన్న విషయాన్ని అందరూ దృష్టిలో ఉంచుకొని సమయపాలన పాటించాలని అన్నారు. తనతో పాటు కార్యాలయంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసినప్పుడే పట్టణంలో రోజువారి సమస్యలు ఉండవని అన్నారు. గోదావరి నదీతీరంలో కరెంట్ తీగలపై పడిపోయిన చెట్టుకొమ్మలను తొలగించి, అటువైపు లైన్ కు విద్యుత్ పునరుద్ధరణ పనులను చేయించారు.

రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-నిర్మల్

రజకుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అధునాతన దోబీ ఘాట్ ఏర్పాటు చేసేందుకు పట్టణ రజక సంఘ కమిటీతో కలిసి ధర్మ సాగర్ వద్ద స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దోబీ ఘాట్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. త్వరలోనే మంత్రి చేతుల మీదుగా ధర్మసాగర్ వద్ద అధునాతన దోబీ ఘాట్ నిర్మాణ పనులు ప్రారంభ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రజకులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని అన్నారు. చైర్మెన్ వెంట ఏఈ హరిభూవన్, స్థానిక కౌన్సిలర్ ఖాజా మాజిదొద్దిన్, రజక సంఘ సభ్యులు ఉన్నారు.

పెండ్లికి నిత్యావసర సరకుల పంపిణీ



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని లొద్దిగూడ గ్రామానికి చెందిన సిడాం జంగు లక్ష్మీబాయి, చిత్రు నాగుబాయి దంపతులు నిరుపేద కుటుంబాలు వీరిపెండ్లి కార్యక్రమానికి ఆదివారం దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి100 కేజీల బియ్యం, 15 లీటర్ల వంట నూనె, 10 కిలోల పప్పు, ఇతర నిత్యావసర సరకులు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ఫౌండేషన్ చైర్మెన్ ప్రవీణ్ నాయక్ సాటి నిరుపేద కుటుంబానికి ఆదర్శంగా నిలిచి, మానవత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. ఆ నిరుపేద కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నందున నిత్యావసర సరకులను ఆర్థిక సహాయంగా పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులు పూసం సురేష్, మెస్రం చిన్ను, సలాం మధు, మెస్రం జైతు గ్రామస్తులు ఉన్నారు.

ప్రపంచ విజ్ఞానానికి మూలాలు పుస్తకాలే



నవతెలంగాణ-నిర్మల్

ప్రపంచ విజ్ఞానానికి మూలాలు పుస్తకాలేనని, సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు, పద్యకవి బి.వెంకట్ అన్నారు. ఆదివారం సోఫీనగర్‌లోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విలువలను పెంచే ఉత్తమ గ్రంథాలను ఉచితముగా అందజేశారు. పుస్తకాలపై గురుకుల గ్రంథాలయంలో అవగాహనను కల్పించారు. తర్వాత విద్యార్థినులచేత పుస్తకాలను చదివింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పుస్తకాలను నిరంతరం చదువుతూనే ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉట్నూర్ గిరిజన హస్తకళాలు అద్భుతం

- మంత్రి కేటీఆర్ ట్వీట్



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హస్తకళాలను ఉట్నూర్ ఐటీడీఏ ప్రోత్సాహించడంపై ఉట్నూర్ గిరిజన హస్తకళాలు అద్భుతమని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ ట్విట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన హస్తకళాలలైన దొంక్ర మెటల్ క్రాఫ్ట్, గోండి పెయింటింగ్స్, స్వచ్ఛమైన తేనె తయారీ, కొన్ని రకాల మిల్లెట్స్, ఇప్పపువ్వు లడ్డుల తయారిపై ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి గిరిజన హస్తకళాలకు ఐటీడీఏ చేయుతనిస్తుందని, ఇటీవల ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్టును చూసిన మంత్రి కేటీఆర్ ట్వీట్ చేసి అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో ఇలాంటి కళలు బయటకు రావడం మహా అద్భుతమని కొనియాడారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మంచిర్యాల



కమ్మవారి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో చలివేంద్రం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రివర్యులు బోడ జనార్దన్, పట్టణ కౌన్సిలర్లు సంజీవ్, కొండలరావు, శ్రీనివాస్, సమితి సభ్యుల ఆధ్వర్యంలో పూల మాలలతో నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మంత్రి బోడ జనార్దన్ చలివేంద్రం, మజ్జిగ పంపిణీనీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు జగదీష్ మురళీధర్, వర ప్రసాద్, శ్రీనివాసరావు, అర్జున్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మావో, సూరిబాబు, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టీజీ సెట్

నవతెలంగాణ-తాండూర్



తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలలో 8075 మంది విద్యార్థులకు గాను 7627 మంది విద్యార్థులు హాజరయ్యారు. 448 మంది విద్యార్థులు మాత్రమే గైరహాజరైనట్లు ఆదిలాబాద్ రీజనల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూప రాణి తెలిపారు. అన్ని కేంద్రాల్లో తాగు నీరు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఏర్పాటు చేయించి ఎలాంటి సమస్యలు లేకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మేలైన రకం విత్తనాలతో అధిక దిగుబడులు



నవతెలంగాణ-జన్నారం

మేలైన రకం విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జినెక్స్ సంస్థ మార్కెటింగ్ అధికారి రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని కలమడుగు గ్రామంలోఆ సంస్థ ఆధ్వర్యంలో పండించిన వరి రకం 801, చిట్టి పొట్టి విత్తనంపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. మేలు రకమైన విత్తనాలతో పంటలలో అధిక దిగుబడి సాధించవచ్చని, రైతులు ఆధునిక పద్ధతులు అనుసరించాలని ఆయన సూచించారు. కలమడుగు గ్రామంలో ఈ వరి నూతన వంగడాలను దాదాపు 20 మంది రైతులు వేసుకొని అధిక దిగుబడులు సాధించారన్నారు. మండలంలోని రైతులు ఈ వరి వంగడాలను తమ పొలాలలో వేసుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు లక్ష్మణ్, రాజు డిస్ట్రిబ్యూటర్లు, సత్యనారాయణ ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశీ రావు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం (టీబీఎస్ఎస్) అధ్యక్షుడు అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బీ.అశోక్ కు భారతరాజ్యాంగ పుస్తకాన్ని అందజేశారు. అనంతరం రాజలింగు మోతె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివేలా వారిలో పఠనాసక్తిని పెంచేలా ప్రభుత్వం ప్రతి గ్రామంలో గ్రంథాలయాల ఏర్పాటుకునిధులను కేటాయించాలన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు పుస్తక పఠనాన్ని అలవాటు చేసే విధంగా పాఠశాల టైం టేబుల్‌లో ప్రత్యేకంగా ఒక పీరియడ్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలిగిరి కనకరాజు , టీబీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏల్పుల వెంకటస్వామి, సభ్యులు ఏల్పుల మహేందర్, రాజేందర్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పోన్కల్ సర్పంచ్ చేయూత



నవతెలంగాణ-జన్నారం

అకాల వర్షంతో ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబానికి పోన్కల్ గ్రామ సర్పంచ్ జక్కుల భూమేష్ ఆదివారం బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు అందజేశారు. మండలంలోని జువ్విగూడాలో గురువారం రాత్రి వచ్చిన అకాల వర్షానికి చిన్నులు అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ తనవంతుగా చూయూతనందించారు.

కెరమెరిలో వడగండ్ల వాన



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మారుమూల గ్రామాల నుంచి వారసంతకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత పక్షం రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలకు ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో ఎండవేడిమి నుండి మండల ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. ఈదురు గాలులకు ఎలాంటి నష్టం జరగలేదు.

గ్రామపంచాయతీ కార్మికులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల



పంచాయతీ కార్మికులకు ఉద్యోగ బద్రత కల్పించి వారికి న్యాయం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజీత్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆదివారం ఐబీ చౌరస్తా ఆవరణలో తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా విస్తతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు అవునూరి సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలను సస్యశ్యామలంగా తీర్చిదిద్దడంలో, పరిశు భ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తోందని విమర్శించారు. పని ప్రాంతంలో కార్మికులకి ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వ స్పందించక పోవడం చాలా దారుణం అని అన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబానికి బద్రత లేకుండా పోయిందని అన్నారు. ఆ కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కార్మికులు అనారోగ్య బారిన పడుతు, ప్రమాదలకు గురవుతున్నారని అన్నారు. అందుకే ఈ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చే నూనె, సబ్బులు, బెల్లం, చెప్పులు, యూనిఫామ్‌లు వెంటనే ఇవ్వాలని, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత సౌకర్యాలు, రూ.20 లక్షల ప్రమాద బీమా సౌకర్యాలు వెంటనే కల్పించాలి డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోవు రోజుల్లో గ్రామపంచాయతీ కార్మికులు చేసే పోరాటానికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని అన్నారు. అనంతరం 18 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దాసరి సురేష్, కోశాధికారిగా ఏ.చిన్నన్న కార్యదర్శిగా చందు, ఉపాధ్యక్షులుగా సుధాకర్, సంపత్, సహాయ కార్యదర్శులుగా సాయి కృష్ణ, ప్రశాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అగ్రి ఎంపాయిస్ అసోషియేషన్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా అగ్రి ఎంప్లాయిస్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. వివిధ కంపెనీలలో పని చేస్తున్న విత్తన, ఎరువుల మందుల, ఎరువు దుకాణాలు, వ్యవసాయ సంబంధిత అగ్రి ఉద్యోగులంతా అసోషియేషన్ రిజిస్ట్రేషన్ చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కవ్వల మహేందర్, ఉపాధ్యక్షులుగా ఎరుకుల్ల సునీల్, ప్రధాన కార్యదర్శిగా కొండపర్తి తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా భట్టుపెల్లి సంతోష్, కోశాధికారిగా లోనారె రాజేందర్, సభ్యులుగా జాడి రాజేష్, ఆరీఫ్‌ఖాన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మహేందర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఏదైనా సమస్య వస్తే ఐక్యంగా పోరాడి పరిష్కరించుకునేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతీ ఉద్యోగికి లేబర్ ఇన్సూరెన్స్ కోసం దరఖాస్తు చేయించి, ఉద్యోగ భద్రతకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అగ్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీడు బసవేశ్వరుడు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుల, వర్ణ, వర్గ, జాతి, లింగ, మత వివక్షతలు లేని సమ సమాజ స్థాపన కోసం కృషి మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. ఆదివారం మహాత్మా బసవేశ్వరుని 890వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జయంతి ఉత్సవానికి అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి హాజరై బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సమానమేనని, వివక్షలతో సంబంధం లేకుండా కలిసి ఉండాలని సమానత్వం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడని అన్నారు. ప్రజలను ఏకం చేస్తూ వీరశైవ మతాన్ని ఏర్పాటు చేశారని, ఆహారం, ఇల్లు, వస్త్రాలు, జ్ఞానం, వైద్యం కనీస హక్కులు అని, భక్తి కన్నా సత్‌ప్రవర్తన, మానవత్వం ముఖ్యమని చాటారని అన్నారు. మహాత్మా బసవేశ్వరుడు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ పాల్గొన్నారు.

కొక్కిరాల ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా

- ట్యాక్టర్లను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ



నవతెలంగాణ-మంచిర్యాల

వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ప్రాంతాలకు ఉచితంగా మంచినీటి సరఫరాను చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్సాగర్‌రావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసం వద్ద కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటిని సరఫరా చేసే ట్యాంకర్లను ఆయన ప్రారంభించారు. అభివద్ధి అని చెప్పుకుంటున్న పాలకులు ప్రజలకు కనీసం మంచినీటిని కూడా అందించలేకపోవడం వారి అసమర్థ పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రజలకు కనీస వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ కార్యదర్శి చిట్లా సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, నాయకులు జంగా పెల్లి బాబన్న, దాసరి లచ్చన్న, హేమలత, రాజమౌళి పాల్గొన్నారు.

29న చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న చేపట్టే చలో హైదరాబాద్ పోస్టర్లను ఆదివారం మండంలోని రవీంద్రనగర్‌లో సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణామాచారి విడుదల చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల లాగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 కేజీల బస్తాకు మించిన భరువులు నిశేదించాలని, ప్రమాద భీమా, ఆరోగ్య భీమా, ప్రభుత్వ ప్రవేట్ సంస్థలలో పనిచేస్తున్న హమాలీలకు వర్తింపజేయాలన్నారు. ప్రతీ హమాలీ కార్మికునికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 55 సంవత్సరాల పైబాడిన హమాలి కార్మికులకు రూ.6 వేలు పిఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలో పని చేస్తున్న హమాలిలకు 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మికుల సంఘం మండల నాయకులు జి.పోషన్న, ధరణి రమేష్, దాసరి రమేష్, గట్టు మధునయ్య, ఏడ్ల రమేష్, రౌతు సత్తయ్య, ఎడ్ల కుమార్, పున్నపెటి మదునయ్య, అత్రం దుర్గయ్య, నారాయణ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో కాసిపేట గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని మండల అధ్యక్షుడు అగ్గి సత్తయ్య పటేల్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల వివరాలు ప్రకటించారు. అధ్యక్షుడిగా పానగంటి తిరుపతి పటేల్, ఉపాధ్యక్షులుగా ఉస్కమల్ల బక్కయ్య పటేల్, ప్రధాన కార్యదర్శిగా సిద్ధం శంకర్ పటేల్, కోశాధికారిగా పానగంటి రాజేశం పటేల్‌ను ఎన్నుకున్నారు. మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి పాటు పాడుతామని నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా సలహాదారులు రౌతు సత్తయ్య పటేల్, మండల అధ్యక్షులు అగ్గి సత్తయ్య పటేల్, ఉపాధ్యక్షులు ఉస్కెమల్ల గోపాల్ పటేల్, గౌరవ అధ్యక్షులు మడిపెల్లి తిరుపతి పటేల్, అధికార ప్రతినిధి పెద్దపల్లి శంకర్ పటేల్ పాల్గొన్నారు.

అభివృద్ధిని ఆదరించేలా కృషి చేయండి

- బీఆర్ఎస్ పార్టీ పరిశీలకులు నారాదాసు లక్ష్మణ్



నవతెలంగాణ-తాండూర్

బీఆర్ఎస్ అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో ఆదరించేలా ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్ సూచించారు. ఆదివారం మండలంలోని సురభి మినీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్తానంలో నిలిపారని అన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ ఎంతగానో కషి చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పిస్తూ, రాష్ట్ర సంపాదన పెంచే దిశగా వ్యవసాయ రంగానికి చేయూతనందిస్తుందన్నారు. అందుకు గాను రైతుల కోసం ఉచిత విద్యుత్తు, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, పెట్టుబడి సాయం లాంటి కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. చేప పిల్లల పంపిణీ గొర్రెల పెంపకం వంటి పథకాలతో కులవత్తులను ప్రోత్సహిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తోందన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నియోజకవర్గం అభివద్ధికి ఎంతగానో కషి చేశారని మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించి హైట్రిక్ సాధించే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కోరారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు బీటీ రోడ్ల సౌకర్యం కల్పించారన్నారు. బెల్లంపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పూర్తయినట్లయితే స్థానికులకు ఎంతో లాభం చేకూరుతుందని తెలిపారు. నూతనంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం గురుకులాలకు కొత్త బిల్డింగ్ నిర్మాణాలు చేపట్టి వైద్య విద్య రంగాల్లో అభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జడ్పీ చైర్మన్ పురుషోత్తం గౌడ్, ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ బాలయ్య, మహిళా అధ్యక్షురాలు దాగాం శంకరమ్మ, ఎంపీటీసీలు మొగిలి శంకర్, సిరంగి శంకర్ పాల్గొన్నారు.

సమావేశాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం



వికలాంగుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25 మహబూబాబాద్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు కాల్ల సుగున కోరారు. ఆదివారం మండల కేంద్రంలో చలో మహబూబాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులకు రూ.6000 పింఛన్ ఇవ్వాలన్నారు. వికలాంగులు 2016 చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. దళిత బంధు మాదిరిగా వికలాంగ బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల్లో ప్రమోషన్లలో నాలుగు శాతం రిజర్వేషన్లను వికలాంగులకు కల్పించాలన్నారు. వికలాంగులుగా ఉన్న కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. వికలాంగులకు ఆదాయపరిమితి గ్రామీణ ప్రాంతాల్లో ఎనిమిది లక్షలు పట్టణ ప్రాంతాల్లో రూ.10 లక్షల వరకు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యాటపోసవ్వ, భాగ్యలక్ష్మి, శ్రీవాణి రాజవ్వ పాల్గొన్నారు.

25న ప్రతినిధుల సభను విజయవంతం చెయ్యాలి



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గం కేంద్రంలో ఈ నెల 25వ తేదీన జరిగే బీఆర్ఎస్ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ కళాశాలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని గ్రామాల్లో మండల కేంద్రాల్లో జెండా పండుగను నిర్వహించి ఆ సభకు బయలుదేరి రావాలన్నారు. ప్రతి మండలం నుంచి దాదాపు 5,000 మది కార్యకర్తలు రావాలని సూచించారు. కార్యకర్తలే పార్టీకి పునాది అన్నారు. పార్టీలో వర్గ విభేదాలు లేకుండా కార్యకర్తలంతా ఒకే తాటిపై నడిచి రానున్న ఎన్నికల్లో మరోసారి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం రాజారాంరెడ్డి, సులువ జనార్దన్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
సోమవారం 24 ఏప్రిల్ 2023

కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కుక్కల దాడిలో ఒకరు తీవ్ర గాయాల పాలయ్యారు. పట్టణంలోని శివాజీ చౌక్ కూరగాయల మార్కెట్ వద్ద ఆదివారం ఉదయం పనుల నిమిత్తం వెళ్లిన మావల మండలం వాఘాపూర్ గ్రామానికి చెందిన కుడిమేత గంగారాంను కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. దీంతో అతనిని స్థానికులు ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఫర్టిలైజర్ షాప్‌లో అక్షయ తృతీయ సందడి

నవతెలంగాణ-నార్నూర్



అక్షయ తృతీయను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని కోటగిరి ఫర్టిలైజర్ షాప్‌లో రైతులు విత్తనాలను కొనుగోళ్లు చేశారు. ఖరీఫ్ సీజన్ ముందు ఉన్నప్పటికీ అక్షయ తృతీయ ఉండటంతో రైతులు వెనుకడుగు వేయకుండా విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఫర్టిలైజర్ దుకాణంలో ఉత్సహంగా బారులు తీరారు. ఫర్టిలైజర్ డీలర్ కోటగిరి విశాల్, రైతులు పరశురాం ప్రకాష్ ఉన్నారు.

స్త్రీ విద్యకు ఎనలేని కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కులతత్వ నిర్మూలన, స్త్రీ విద్యకు ఎనలేని కృషి చేసిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో బసవేశ్వర చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించి, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విశ్వగురు బసవేశ్వరుడు సమాజంలో కుల వివక్ష నిర్మూలనకు, అంత్య కులస్తుల ఆత్మ వికాసం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో జన్మించిన బసవేశ్వరుడు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, బానిసత్వం, మూఢనమ్మకాలను విడనాడాలని బోధించేవారని అన్నారు. మనుషులంతా ఒక్కటేనని, కులాల ఐక్యతకు, సమానత్వం కోసం పని చేశారని అన్నారు. బసవేశ్వరుని ఆశయాలను కొనసాగించాలని అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను నేటి యువతరానికి తెలియజేసేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు రాజలింగు, సునీత కుమారి, శంకర్, పరిశ్రమల శాఖ అధికారి పద్మ భూషణ్, వివిధ కుల సంఘాల నాయకులు చిక్కాల దత్తు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉట్నూర్: బసవేశ్వరుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉత్సవ కమిటి సభ్యులు జాదవ్ అజయ్ కుమార్, శారదాబాయి, గణేశ్ అన్నారు. బసవేశ్వర జయంతి వేడుకలను ఆదివారం మండలంలోని హాస్నాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడని, సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన భారతీయ దార్శనికుడు బసవేశ్వరుడని కొనియాడారు. కుల మతాలకతీతంగా మనుషులంతా ఒక్కటేనని, బసవేశ్వరుని సమతా తాత్వికతను చాటి చెప్పని గోప్ప వ్యక్తన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు పాల్గొన్నారు.

నిర్మల్ : ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బసవేశ్వర జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ అధికారికంగా ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త, సమాజంలో కుల, వర్ణ, లింగ బేధాలు లేవని, అందరం సమానమేనని చాటి చెప్పిన మహనీయులు అని అన్నారు. విశ్వగురువు అని కొనియడారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ కోరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ సుభాష్ రావు, బీసీ విద్యార్థి సంఘ కార్యదర్శి మనోజ్ యాదవ్, రైతు సమన్వయ వార్డు అధ్యక్షులు పిండి శ్రీనివాస్, వీరశైవ లింగాయత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: మహాత్మా బసవేశ్వర మహరాజ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బసవేశ్వర చౌక్‌లోని ఆయన విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, లింగ బలిజ కులస్థులతో కలిసి పూజలు నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. బసవేశ్వర భవన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. లింగ బలిజ కులస్తుల సమస్యల పరిష్కారానికి కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నారు.

ప్రశాంతంగా గురుకుల ఐదో తరగతి ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, ప్రభుత్వ గిరిజన గురుకుల, మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల ఐదో తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు తమ పోషకులతో పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకున్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్‌లో 504 మంది విద్యార్థులకు గాను 482 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 22 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు సంబంధిత సెంటర్ ప్రిన్సిపాల్ రఫీయోద్దిన్ తెలిపారు. అలాగే బాలికల గిరిజన పాఠశాల పరీక్ష సెంటర్‌లో 504 విద్యార్థులకు గాను 483 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే పరీక్ష సెంటర్‌లో 240 మంది విద్యార్థులకు గాను, 235 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 5 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సంబంధిత సెంటర్ ప్రిన్సిపాల్ లవీణ తెలిపారు. స్థానిక పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బీఆర్ఎస్ ప్లీనరీ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 25న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ సూచించారు. ఆదివారం మాన్కాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్లీనరీ సభకు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ తోడసం నాగోరావ్, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ ఆడే సురేష్, కోఆప్షన్ సభ్యులు షేక్ దస్తగిర్ బీఆర్ఎస్ నాయకులు ఖాశీం, యుర్వేత రుపదేవ్, కనక ప్రభాకర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఈనెల 25న నియోజకవర్గస్థాయి పార్టీ ప్లీనరీ సమావేశానికి మండలం నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఎమ్మెల్యే రేఖా నాయక్ సూచించారు. ఆదివారం స్థానిక ఏఆర్ఎస్ కళాశాలలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ప్రభుత్వం చేపట్టిన పనులు, పథకాలపై పార్టీ ప్లీనరీలో చర్చ ఉంటుందని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేల ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జాదవ్ శ్రీరామ్, ఎంపీపీ పంద్ర జైవంత్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మూడు రోజులకే పరిమితమైన మిషన్ భగీరథ నీళ్లు..

- సరాఫరా కాని మిషన్ భగీరథ నీరు
- బోరుబావి నీళ్లే దిక్కు



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీళ్ల ప్రజలకు కలగానే మిగిలిపోయాయి. కోట్లాడి రూపాయాలు ఖర్చు చేసి ప్రభుత్వం మిషన్ భగీరథ పైపులను వేసింది. రాష్ట్రంలో ఎక్కడ కూడా మహిళల తలలపై నీళ్ల బిందెలు కనపడకూడదని, ప్రతి ఇంటికి నల్లల ద్వారా నీరు అందిస్తామని, అందని పక్షంలో ఓట్లు కూడా అడగమని సీఎం కేసీఆర్ అన్నారు. మండలంలో అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. మండలంలోని ఉమ్రి గ్రామపంచాయతీ పరిధిలో గల మారుమూల గిరిజన గ్రామమైన దేగాం గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ల ప్రారంభ దశలో మూడు రోజులే నీళ్ల వచ్చాయని ఆపై గ్రామంలోని బోరుబావి నీళ్లే తాగాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ మారుమూల గ్రామాలకు సైతం నీరు అందడం లేదని పలువురు వాపోయారు. ఆదివాసీ ప్రజలను ఎవరు పట్టించుకుంటారని గిరిజనులు తమ గోడును మిడియాతో వెళ్లబోసుకున్నారు. మిషన్ భగీరథతో గ్రామంలోని సీసీరోడ్లన్ని ధ్వంసం అయ్యాయని పేర్కొన్నారు. ఇంటింటికీ నల్లా అమర్చినప్పటికీ మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి, సీసీరోడ్లు వేయించి, మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.



చేతి పంపులే దిక్కయ్యాయి

గ్రామంలో ప్రతి ఇంటికి నల్లాలు బిగించారు. కాని ఇప్పటి వరకు మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదు. దీంతో గ్రామంలోని చేతిపంపులు, బావులే దిక్కయ్యాయి. ఈ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్నాం



ఉయికే సుగుణ బాయి
గ్రామస్తురాలు

భగీరథ నీరు మూడు రోజులే వచ్చాయి

మిషన్ భగీరథ నీళ్ల మొదట్లో మూడు రోజులే వచ్చాయి. తర్వాత నీళ్ల రావడంలేదు. ప్రతి ఇంటికి నల్లా బిగించినప్పటికి మిషన్ భగీరథ నీళ్ల మాత్రం రావడం లేదు.



మంగారపు రామన్న
గ్రామస్తుడు

రైతు సంక్షేమే ప్రభుత్వ ధ్యేయం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

నవతెలంగాణ-ముధోల్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వడ్తాల్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటుందని అన్నారు. దేశంలోనే తెలంగాణ సీఎం కేసీఆర్ ఎనలేని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నారని అన్నారు. రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఏ రకం వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.2060, బీ రకం వరిధాన్యానికి రూ.2040 ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, మండల రైతుబంధు అధ్యక్షులు రాంరెడ్డి, సర్పంచ్ రూపాదేవి విఠల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బాపురావు, గుర్రం మురళి, డైరెక్టర్‌లు, ఆత్మ డైరెక్టర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాలికకు అండగా నిలిచిన పూర్ణచందర్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

తల్లిదండ్రులు లేని బాలిక అనారోగ్యం కారణాంగా ఆస్పత్రిలో చేరింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు బదావాత్ పూర్ణచందర్ నాయక్ అండగా నిలిచారు. ఆస్పత్రిలో వైద్యం చేయించి, తిరిగి ఇంటికి పంపించారు. ఆదివారం ఆయన మండలంలోని బీర్సాయిపేట్ గ్రామంలో ఉండే బాలిక చిన్నారి రవళిని పరామర్శించారు. ఆరోగ్యం, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన చిన్న తనంలోనే తల్లితండ్రులని కోల్పోయిందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకులు బధావాత్ పూర్ణచందర్ నాయక్ దగ్గరుండి తనని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి, సీఎం కేసీఆర్ సహాయ సహకారాలతో రూ.4లక్షల వైద్య సహాయంగా అందించి, ప్రాణదాతగా నిలిచాడని పలువురు అభినందించారు. తనకి పునర్జన్మనిచ్చిన పూర్ణచందర్‌కి, సీఎం కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అనంతరం రవళి అమ్మమ్మ గంగారపు పద్మ మాట్లాడుతూ ఓ పక్క తల్లితండ్రులను కోల్పోయి, మరో పక్క అనారోగ్యంతో బాధపడుతున్న రవళిని అన్నలాగ అక్కున చేర్చుకుని, అన్నీ తానై తన కుటుంబానికి అండగా నిలిచి రవళి ప్రాణాలని నిలబెట్టిన పూర్ణచందర్ నాయక్‌కి సదా రుణపడి ఉంటామని కన్నీరు పెట్టుకుంది. పూర్ణచందర్ నాయక్ మాట్లాడుతూ రవళి పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని ఉన్నత చదువులకు అవసరమయ్యే అన్నీ ఖర్చులు తానే స్వయంగా బరిస్తానని కుటుంబానికి బరోసానిచ్చారు.

గాలివాన బీభత్సం

- పడిపోయిన స్తంబాలు, కరెంటు తీగెలు
- కొత్తపెల్లి గ్రామంలో 22కుటుంబాలకు ఆస్తి నష్టం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. గాలి వాన బీభత్సంతో కొత్తపెల్లి గ్రామంలోని పలు కుటుంబాల ఇంటిపై నుంచి రేకులు గాలిలో ఎగిరిపోయాయి. దీంతో రేకులు ధ్వంసమయ్యాయి. వర్షంతో ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంట్లో నిల్వ ఉన్న పత్తి, నిత్యావసర సరుకులు నాశనమయ్యాయి. కరెంటు స్తంభాలు తీగలు పడిపోయాయి. దీనితో ఏకంగా గ్రామంలో అంచనా ప్రకారం 22 కుటుంబాలకు కలిపి లక్షలలో అస్థి నష్టం వాటిల్లినట్టు బాధితులు పేర్కొంటున్నారు. సంబంధిత అదికారులు సర్వే నిర్వహించి, బాధితులకు ఆదుకోవాలని కోరుతున్నారు. భారీ వర్షం ద్వారా నష్టాలకు పాలైన ఇండ్లను స్థానిక సర్పంచ్ రాథోడ్ సుభద్రబాయి రామేశ్వర్ పరిశీలించారు. అధికారుల ద్వారా సర్వే నిర్వహించి, ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా నిచ్చారు.



ఈటెల రాజేందర్ క్షమాపణ చెప్పాలి

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ నాయకులు ఆదిలాబాద్‌లో నిరసనకు దిగారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆదివారం ఈటెల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై ఈటెల రాజేందర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈటెల రాజేందర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈటెల బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు అవినీతికి వత్తాసు పలుకుతూ ఇప్పుడు కాంగ్రెస్ నాయకులను విమర్శించడం విడ్డురంగ ఉందని అన్నారు. తమ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పకపోతే తెలంగాణలో ఎక్కడ తిరిగిన యూత్ కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అంబకంటి అశోక్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నాహిద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, రసం కిస్తూ, తుడం వినోద్, తాహెర్ ఖాన్, ఫైయిమ్, మోసిన్ ఉన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-కడెం

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లావణ్య కార్యదర్శి సుస్మిత, ముత్తయ్య కవిత, స్వామి, రవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో కండక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నిజాయితీ చాటుకున్నాడు. వివరాలకు వెళ్తే ఆదివారం హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ బయలుదేరిన సూపర్ లగ్జరీ బస్సులో ప్యాసింజర్ శాభాజ్ ఉద్దీన్ బ్యాగ్ బస్సులోనే మరిచిపోయి నిర్మల్‌లో దిగిపోయాడు. ఈ బ్యాగ్‌లో లాప్టాప్, మందులు ఉన్నాయి. ఈ లాప్టాప్ బ్యాగ్‌ని గమనించి కండక్టర్ ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పనకు తెలియజేశారు. బాధితుడికి సమాచారం ఇవ్వగా ఆదిలాబాద్‌కు వచ్చి డీఎం చేతులు మీదుగా ఆ బ్యాగ్‌ను తీసుకున్నాడు. దీంతో నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆన్‌లైన్ ఇన్‌చార్జి హుస్సేన్ ఉన్నారు.

ఆరో రోజుకు చేరిన వీఓఏల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ముందు వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, న్యాయం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని వీఓఏలు కోరారు. అదేవిధంగా వీఓఏలను సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆరో రోజు నిరవధిక సమ్మెలో పాల్గొన్న వారిలో కాడే రామన్న, కాడే రాధిక, నారాయణరెడ్డి, వినోద్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-తలమడుగు

కుచులాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర రమేష్‌కు సీఎంఆర్ఎఫ్ నుండి వచ్చిన రూ.46 వేల చెక్కును మాజీ ఎంపీ గోడం నగేష్ ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బాధితుడికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు కనపర్తి చంద్రకాంత్, మాజీ జెడ్పీటీసీ గంగమ్మ, జక్కుల ప్రభాకర్, సుంకిడి సర్పంచ్ మహేందర్ యాదవ్, బోండ్ల వెంకటస్వామి, గంధం తిరుపతి, ఆశన్న, రామన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామంలోని గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 504 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 476 పరీక్షకు హాజరు కాగా 28మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమ కల్యాణి తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద స్థానిక ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలో అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం అష్టభుజ వేణు గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ముత్యంరెడ్డి దంపతులు శాస్త్రోక్తంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన ఐకేపీ వీఓఏల సమ్మె

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో వీఓఏలు చేపడుతున్న సమ్మె ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లిస్తూ రూ.పది లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా సౌకర్యాలు కల్పించాలని, గ్రామసంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతీ నెలా వేతనాలను వీఓఏల వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. వీఓఏలు ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు ధన్‌రాజ్, కార్యదర్శి అంకయ్య, నాయకులు లలిత, తిరుపతి, మోహన్, రాంచందర్, సంధ్య గీత పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మె 7వ రోజు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారని అన్నారు. తాము చేస్తున్న సేవలకు గుర్తింపుగా తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం నుండి సరైన హామీ వచ్చేవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. రెండో రోజు సమ్మెలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు బుద్దు, కార్యదర్శి రమ, నాయకులు ఓమాజీ, పద్మ, ఫారజానా, ప్రమోద్, జయలక్ష్మీ పాల్గొన్నారు.